కథ :

# 'అడవిలోని వెన్నెల'

బి. యస్. రాములు

వర్షం కురిసి కురిసి ఆరోజు వుదయాన్నే తెరిపియిచ్చింది. ఆకాశం పండిన పత్తిచేను గాలికి కదులుతున్నట్టుగా వుంది.

గాలికి టేకు ఆకులు కదలాడాయి. ఏనుగు చెవుల్లాంటి ఆ ఆకుల మొరటు నారలలో అంటుకొని ఆగిపోయిన చినుకులు తుంపరగా రాలుతున్నాయి.

ఏపుగా పెరిగిన పచ్చగడ్డిలో రాలిన చినుకులు గడ్డిపోసలపై అమరిన ముత్యాల్లా మెరుస్తున్నాయి. అందమైన ప్రకృతిదృశ్యాల మధ్య పడుకొన్న పెద్ద మేకలు లేచి నిలబడి ఒళ్ళువిరుచుకున్నాయి. పిల్ల మేకలు తల్లి పొదుగు చేరాయి. వాటికి వెచ్చదనంకోసం కిందపరిచిన ఎండుటాకులు వాటికాళ్ళ తొక్కుడికి చిందర వందరై పోయాయి.

పక్కనేవున్న నెగడు మండి మండి నివురు గప్పుతోంది. కొరుకులు యింకా చల్లారలేదు. పిల్ల మేక ఒకటి తల్లి పొదుగుకోసం చెంగ వేయడంతో ఇంకా చల్లారని కొరుకుపై కాలుపడి మిర్రకొట్టి 'మే' అని అరిచింది. ఒకటి తర్వాత ఒకటి మర్చిపోయిన అరుపును తిరిగి అపుడే నేర్చుకున్నట్టుగా లయగా 'మేఁ' అంటూ అరవడంతో వులిక్కిపడి లేచాడు యిస్రూ తలండి. పక్కనే నిద్రపోతున్న కూతురు మోతీ కప్పుకున్న పాతగుడ్డని సరిచేశాడు.

మంచంలోంచి లేచి ఒళ్ళు విరుచుకున్నాడు. మేకల పాకవేపు దృష్టి సారించాడు. చెల్లాచెదరైన కొరుకుల్ని సరిచేశాడు. మరోమంచంలో గాఢనిద్ర పోతున్న కొడుకు వేపు చూశాడు.

ఇపుడిపుడే జొన్నకంకి పాలుపోసుకొంటోంది. ఇప్పట్నించి పంట యింటి కొచ్చేదాకా మరింత జాగ్రత్తగా కావలా కాయాలి. అర్ధరాత్రిదాకా తాను కావలా కాసాక ఏసుని నిద్రనించి లేపి కావలా వుండమని తాను పడుకున్నాడు. తను లేవకముందే వీసు గుర్రు కొడుతున్నాడు. మేకలను పక్క పాకలోనే కట్టేసినా

వాటి వాసనకు వచ్చి పులిగొడ్తే ? ఎం గుబంట్లు, ఏదులు జొన్నకర్రలు పీక్కపోతే? ఛ ! వీడికి వయసు వచ్చినా బాధ్యత గుర్తెరగడం లేదు !

వీడికి బాధ్యత తెలిసిరావడానికేం చేయాలి ! ఆఁ! వీడికి పెళ్ళి చేస్తేసరి ! వేరుగుడిసె, వేరు సంసారం, వేరు వ్యవసాయం ! అప్పుడుగాని వీడికి బుద్ధిరాదు.

అవునూ ! వీడూ బాబూరావు మడె కూతురు లకింబాయీ దోస్తులైనట్టున్నారే! వీడు మాహూవా (విప్ప) పూలు ఏరడానికి తన వెంట వచ్చినప్పుడేవచ్చి ఎక్కడో తప్పదీస్తాడు. వెతగ్గా వెతగ్గా లకింబాయి పక్కన నవ్వుతూ కనపడతాడు. తనని చూడగానే ఏమీఎరగట్టు తన వెంట వచ్చేస్తాడు. నాకు తెలీదనుకుంటాదేమో వీడు !

లకింబాయి చూడ చక్కనిపిల్ల. కనుబొమ్మలమీదా, నొసట్లోనూ, చెంపలమీదా, గదువుమీదా, మెడమీదా, మెడకింద పొడిపించుకొన్న చుక్కబొట్లు ఆ చక్కదనాన్ని చిక్కబరుస్తున్నాయి.

అది ఈ నడుమ జాకెట్లు వేస్తూంది. వీనికి తగ్గపిల్ల. లకింబాయి తమ 'యిల్లుచొచ్చి' వీడి పెళ్ళామైతే బాబూరావు మడెతో ఎంత లధాయి అవుతుందో !

బాబూరావు మడె కొంతకలిగినవాడు. రెండు జతల దున్నపోతుల వ్యవసాయం. ఇటీవల ఎదిగిన కోడెదూడల్నిచ్చి రెండు పోతుల్ని తీసుకున్నాడు.

పశువుల అంగడికి పోయినపుడు ఆ బేరగాళ్ళు కోడెదూడల్ని చూసి నాకంటే నాకని కొట్లాడుకు ఛస్తారు. వీటికి బదులుగా యిచ్చే దున్నపోతులు మావి చూడండి అని ఒకడటూ, ఒకడిటూ గుంజుకుపోతారు. కోడెల్ని తీసుకొని దున్నపోతుల్ని యిస్తే వాళ్ళకి ఏం లాభమొస్తుంది ? తమకైతే దున్నపోతులేనయం అన్పిస్తుంది అందుకే బాబూరావు మడె కోడెదూడల పీడ వదిలించుకుని మాంచి బలిసిన దున్నపోతుల్ని తీసుకు వచ్చాడు.

బాబూరావు మడెకు పదిదాకా మేకలున్నాయి. రెండెకరాలు వరిపండే పొలంకూడా వుంది. వాళ్ళగూడెంలో నాందేవ్ గాయితల్ (పెద్ద) తర్వాత అంతటివాడు.

తమకేంవుందీ ! ఈ జొన్నచేనూ, పులవల పండే మరో ఎకరం తప్ప! అయిదు మేకలైతే వున్నాయి. పంట కోతకుముందు జరుపుకునే పండుగకు ఒకటి

ఎలాగూ తెగుతుంది. దసరాకు అహిరి మహారాజ్‌కు ఒకటి ఎలాగూ సమర్పించు కోవాలి. ఫారెస్టు అధికారుల కన్నుబడ్డా, ఎలుగుబంట్ల కన్నుబడ్డా వాటి బతుకు కుప్పకూలిపోవడానికి ఎంతోసమయం అవసరంలేదు.

కళ్ళు నులుముకుంటూ మోతీ లేచింది. మోతీకి చుక్కబొట్లు పొడిపించాలి. ముఖమంతా చుక్కబొట్లు పొడిపిస్తే ఎంత చక్కగా వుంటుందీ! చేతిమీద కూడా చుక్కబొట్లు పొడిపించాలి. లేకపోతే దీన్ని ఎవరు పెళ్ళాడతారు ?

పాక బయట నిలబడి ఒళ్ళు విరుచుకుంటున్నాడు యిస్రూ. ప్రాణంతో సమంగా చూసుకుంటున్న జొన్నచేనువేపు చూశాడు.

జొన్నచేను ఏపుగా పచ్చగా పెరిగి కంకివేసింది. కంకి యిపుడే పాలు పోసుకుంటున్నది. జొన్నకర్రలు వర్షంలో తడవడంతో కడిగినట్టు మరింత పచ్చబారి కన్పిస్తున్నాయి. కర్రలో అక్కడక్కడా నిలిచిన నీటిచుక్కలు నీటిలో మెరిసే చందమామ చేపల్లా కనిపిస్తున్నాయి.

ఇస్రూకు చేపలపై నూరూరింది. వర్షం బాగానే పడింది మడుగులు బాగానే పారుతున్నాయి. ఆ మడుగులో బాగానే దొరకవచ్చు. ఈరోజు ఎలాగైనా చేపలు పట్టుకు రావాలి.

ఈ చలిచలిగా వున్న ఇలాంటివేళ! వేడివేడి జొన్నంబలి తాగుతూ అంచుకు కాల్చిన చేపలు కొరుక్కు తింటుంటే ............ఓహ్! ఎంత కమ్మగా వుంటుంది.

తనని చేపల వేటకాడు అంటారు. ఆ మాటకొస్తే తమ గూడాలలో చేపలు, మాంసం, సారా, పండుగు అంటే యిష్టపడని వాళ్ళెవ్వరు ? దొరికితే రోజూ తిందామనే వుంటుంది అందరికి.

చేపలంటే జ్ఞాపకం వచ్చింది. ఓసారి తన చిన్నతనంలో ఏం జరిగింది ? అపుడు గూడెం యిక్కడ వుండేది కాదు. ఇక్కడికి తూర్పుదిక్కున వుండేది. పక్కనే ప్రాణహిత నది ప్రవహిస్తుండేది.

చుట్టూ దట్టమైన అడవి. యిప్పటివలె అప్పుడు పచ్చిక బయళ్ళు కానీ, అడివి లేని ప్రదేశం కానీ కన్పించేది కాదు. ఎటు చూసిన చూపు అనినంత మేర అడివే.

అపుడు తమకు ఎంత పెద్ద మేకలమంద వుండేదీ! ఆ రోజు మేకలకు నీళ్ళు తాగించబోయి చేపలు కనబడితే వాటిని పట్టుకుంటూ సంతోషంతో మైమరచి పోయాడు. మేకలు అడవిలో పడ్డాయి. ఫారెస్టు అధికార్ల కంటబడ్డాయి. మొత్తం మంద కొట్టుకుపోయి కట్టేసుకున్నారు వాళ్ళు. తన తండ్రి పోయి కాళ్ళ మొక్కినా వదల్లేదు. చివరకు నాలుగు ప్రాణంబట్టిన మేకల్ని దండుగ కింద లాక్కొని మిగ తావి దయతో వదిలిపెట్టారు.

మేకలు జ్ఞప్తికి రాగానే 'మోతీ! మేకలు జాగ్రత్త' అని హెచ్చరించాడు.

వీడింకైనా లేస్తాడా అని కొడుకువేపు చూశాడు. వీసు మంచానికి తలవేపు వంకులు తిరుగుతూ నిటారుగా పొడుచుకొచ్చిన దుప్పికొమ్ముల పంగని కిరీటంగా కట్టుకున్నాడు. దానికి జింకతోలు అమర్చాడు. దుప్పి కొమ్ముకు అడవి సొరకాయ బుర్ర వేలాడుతోంది.

"అరె! సొరకాయబుర్ర మర్చేపోయాను" అని సొరకాయ బుర్రని తీసుకున్నాడు యిస్రూ. మోతీని మరోసారి హెచ్చరించి బయటకు నడిచాడు.

చుట్టూ అడవి. అడవిలో జొన్నచేను. చేనిమధ్యలో ఒక పాక ఆ పాక నానుకొని మేకల పాక. రెండు పాకల మధ్య నెగడు.

ఆ పాకలో రెండు మంచాలు. నాలుగు పంగలకర్రల్ని పాతి పంగలలో మంచంపట్టెల్లా వాసాలు వేసి కదిలిపోకుండా మోదుగునారతో కట్టారు. వాటిపై సన్నని కర్రలు పేర్చి నారతో కదలకుండా కట్టారు. దానిపై వాడిపోయిన గడ్డి. గడ్డి మీద చిరిగిపోయిన పాతపంచె. ఆ మంచం కింద అంబలి కాసే కుండలు.

ఆ పాక వాసానికి పొన్నగడుక మూట వుట్టిలా వేలాడుతోంది. అడివి గడ్డికప్పిన ఆ పాక ఏకాంతంగా వుంది. అక్కడికి కూతపెట్టుదూరంలో మరొకరి చేను. అందులో యిలాంటి మరొక పాక.

రెండుమైళ్ళ పరిధిలో పాకలు వేసికొని ఆ చేనుల్లో కాపలా వుంటున్న వాళ్ళదంతా ఒకే గూడెం. వాళ్ళగూడెం ఈచేన్లకు మధ్యలో కేంద్రంలా వుంటుంది.

ఏడాదికి ఆరునెలలకుపైగా ఆ గూడెం నిర్మానుష్యంగా వుంటుంది. ఎవరి పంట కాపలాకోసం వారు అలా ఆర్నెల్లపైగా ఆ పాకలలోనే వుండాల్సివుంటుంది.

అలా రెండుమైళ్ళ లోపునే మరోగూడెం వుంటుంది పది పన్నెండు కిలో మీటర్ల పరిధిలో అలా ఎనిమిది గూడాల దాకా వున్నాయి.

అడవితల్లి ఒడిలో అమాయకంగా పెరుగుతున్న అడవిపుత్రులు గోండు లలో యిస్రూ కుటుంబం ఒకటి.

సూర్యుడు తూర్పు కొండలలోంచి అపుడే తొంగిచూస్తున్నట్టున్నాడు. మట్టిపెనం మీద దోరగా కాల్చిన జొన్నరొట్టెలా ఆకాశం వెచ్చగావుంది ఆరబోసిన విప్పపూల వాసనల్లా వెలుగు వ్యాపిస్తోంది.

అదిగో ! ఎంత మబ్బుపట్టా తూర్పు కొండలలోని పెద్దదేవునికి క్రమం తప్పకుండా దండం పెడుతోంది పొద్దు. మనసులోనే తానూ పెద్దదేవుడికి మొక్కు కున్నాడు యిస్రూ.

అలివి అయిన బాటలో ముందుకు నడుస్తున్నాడు యిస్రూ. ఏపుగా పెరిగిన గడ్డిలో కొత్తవాళ్ళకు తావ్వే తెలియదు. అలవాటుగా నడుస్తున్న కాలుకు కసుక్కున దిగబడింది.

కత్తిలా మొనదేలిన రాయి ఇదివరలో రెండుసార్లు యిస్రూ పుండుకు గుచ్చుకోవడంతో ఏసు కోపంగా దాన్ని పెరికి పారవేశాడు. అక్కడ కూరిన కొత్త మట్టిలో ఎడంకాలి కింది పుండు కూరుకుపోయింది. మట్టిలోని చిన్నచిన్న రాళ్ళు కుచ్చుకుపోయి విలవిలలాడిపోయాడు. మెల్లగా ఎత్తి మట్టికాలుతోనే అడుగు ముందుకేశాడు. పుండు సలుపుతోంది.

అది (భార్య) ఈ పుండుతోనే పోయింది. ఈ చలికాలం వస్తే సరిగ్గా మూడేళ్ళవుతుంది.

మూడేళ్ళక్రితం వచ్చిన చలికాలం ఇలా చాలామందిని తీసుకుపోయింది. పండిన పత్తికాయ పగిలినట్టు, ఎండకేసిన బొంగు నెర్రె లిచ్చినట్టు, చల్లని చలికి శరీరం పట్టున పగిలే చలికాలం.

అడవాళ్ళు మోకాలి పైనించి చుట్టుకున్న చీరని ఛాతీమీంచి కొంగులా వేలాడేసుకోవడంతో శరీరంమీద మరే ఆచ్ఛాదనా లేక చలికి పగిలి పుండును రంపంతో కోస్తున్న బాధ.

పదిహేను రోజుల్నుంచి జ్వరంతో ఒళ్ళు నెగడులా మండుతున్న సమయంలోనే దానికి బహిష్టు రావాలా ! ఇక తప్పలేదు. ఎప్పటిలాగే బహిష్టు అయ్యాక వేరే పాకలో వుంది. గిరిజన స్త్రీలు నెలసరికి ప్రత్యేకమైన పాకలో చేరతారు.

వున్నవే మూడు ముతకగుడ్డలు. కుండెడు తేనె పుచ్చుకుని షావుకారు యిచ్చిన రెండు చద్దర్లు మడ్డిపంచెలా పల్చగా వున్నాయి. అలాంటివి ఎన్ని కప్పినా ఆ చలిజ్వరం ఆగదు. మరి రెండు పల్చటి చద్దర్లకు ఆగుతుందా ! ఇంట్లోకి రావాల్సిన నాల్గోరోజు వుదయాన అది కట్టెలో కట్టె అయిపోయింది.

ఏ రాత్రి పోయిందో, రాత్రి చలికి అది ఎంత విలవిలలాడిందో ! ఎంతో దిట్టంగా వుండేది - ఎంత కష్టపడి పనిచేసేదీ !

తాను కూడా ఈ పుండుతోనే పోతాడో ఏమో ! ఎన్ని ఆకులు కట్టినా ఎన్ని పసర్లు పోసినా, ఈ పుండు భయపడడం లేదు.

మెల్లి మెల్లిగా మట్టిని తీసేసాడు. పుండులోంచి రసి కారుతోంది. చేపల మీద జిహ్వాచాపల్యం ఆ బాధని అధిగమించింది. మడుగు చేరాడు.

పలచగా కాచుకున్న జొన్న అంబలిలా కదిలీకదలనట్టు ప్రవహిస్తున్నాయి నీళ్ళు. పైనించి ఎక్కడో రాళ్ళను ఢీకొంటున్న నీళ్ళ గలగల విన్పిస్తోంది.

ఉత్తరాన ఉన్న గుట్టమీద పుట్టి అడవిలో బారబారి ప్రాణహితలో కలవడానికి పరుగులు పెడుతున్న వాగు అక్కడ కొంత మడుగుగా వుంటుంది.

మట్టికాలు నీళ్ళల్లోకి దించాడు. పుండుకు అంటిన మట్టి మెల్ల మెల్లగా కరిగిపోతోంది. ఏదో కొరికినట్టై చటుక్కున కాలు పైకి తీశాడు. చేప చెంగున నీటిలోకి దూకింది.

అరరె ! చిటికలో తప్పిపోయింది. అనుకొంటూ పిక్కలోతు నీళ్ళల్లోకి నడిచాడు. కాలును మళ్ళీ ఏదో కొరికినట్టు కాగానే కాలు అలాగే వుంచి చటుక్కున చేతుల్తో చేపను పట్టుకున్నాడు. తీసి ఈడ్చి ఒడ్డుకేసి చరిచాడు. దాని తల భూమికి తాకి తోక ఆడిస్తూ అక్కడే చతికిలబడింది.

ఏదో మెరుస్తూ నీళ్ళల్లో పరుగెడుతోంది. 'పెద్ద పాపరకూన' అనుకుని రెండంగలలో దొరకబుచ్చుకుని ఒడ్డుమీదికి విసిరేసాడు. అదేదో విషపు పాములా వుంది. జరజరా పాకుతూ గడ్డిలో కల్సిపోయింది. అది పామని, కాటేస్తే పోయే వాడేనని తెలిసి భయం వేయలేదు. ప్రమాదాలు వారి నిత్యజీవితంలో కోకొల్లలు. పైపెచ్చు అది పాపరకూన కానందుకు విసుక్కున్నాడు.

జెల్ల చేప కోరలు పుండులో దిగబడి లాగుతుంటే శరీరమంతా బాధతో విలవిలలాడిపోయాడు. అయినా వదల్లేదు. అలా చాలినన్ని చేపలు పట్టుకుని సొరకాయ బుర్రలో వేసికొన్నాడు.

రసితో నీచువాసన వేస్తున్న పుండంతా కొరికినట్టయింది. నీళ్ళలో నానిన పుండు పుర్రెలోంచి అపుడే తీసిన మెదడులా నెత్తురు చారికలతో మరీ పచ్చి అయింది.

ఎడంకాలు పుండువల్ల కాలు చాపి ఒంటికాలిమీద దొడ్డికి కూర్చున్నాడు. ఆకులతో తుడుచుకుని గోచి పెట్టుకుని చేపలు తీసుకుని పాకకు బయల్దేరాడు.

ఓసారి నూనె అమ్మవచ్చిన షావుకారు యిదిచూసి తనని అనాగరికుడని ఎద్దేవా చేశాడు. చేతికి అంటకుండా అశుద్ధాన్ని ఆకులతో తుడిచేసుకోవడంకన్నా చేతికి అంటేట్టు అశుద్ధాన్ని కడుక్కోవడం ఎలా గొప్పదో ? అది అప్పటికీ యిప్పటికీ యిస్రూకి అర్థం కాని విషయం. వాళ్ళ గూడెం వాళ్ళంతా ఆదేపని చేస్తారుకదా !

నడుస్తూ, నడుస్తూ అక్కడక్కడ కన్పించిన 'నన్నెగడ్డల్ని' (వుల్లి గడ్డ, కందగడ్డల్ని పోలివుంటాయి) పెళ్ళగించి పంచెలో వేసికొన్నాడు.

'ఓయా' అని నాల్గుదేవర్ల కటిసిడం నడిమెక్ నిత్తం కేకవేయడంతో ఏంటన్నట్టుగా ఆగిపోయాడు.

కటిసిడం నడిమెక్‌ది యిస్రూ పక్కగూడెం. నేను ఈ తోవకే కొంత లోపలికని వుంటుంది నాల్గుదేవర్ల వాళ్ళు తాబేలు తినకూడదని ఆచారం. తాబేలు యిచ్చి చేపలు తీసుకుపోదామని వచ్చినట్టున్నాడు కటి.

తాబేలును పొతం చేయడం చాలాపని. చేపలైతే యిట్టే కాల్చుకుని తినేసేయవచ్చు. కటి మాటల్లోకి దించాడు.

దసరా ఇంకొద్దిరోజులే వుంది. అహిరి మహరాజ్ కొలువులో దసరా వుత్సవాలు అట్టహాసంగా జరుగుతాయి. అహిరి, సిరొంచ, ఏటపల్లి తాలూకాలలోని గోండులంతా ఆ వుత్సవాల్లో పాల్గొనడానికని చేరుతారు.

అయితే ఎవరి భత్యం వాళ్ళే తెచ్చుకోవాలి. పైపెచ్చు వచ్చినవాళ్ళే అహిరి మహరాజ్‌కు మేకలు, డబ్బులు, కానుకలుగా సమర్పించుకుంటారు. రెండు రోజుల ఆ వుత్సవాలలో పాల్గొనడానికి మరిరెండు రోజులముందే బయలుదేరాల్సి వుంటుంది. మహరాజ్‌కు సమర్పించుకోవడానికి ఒక మేకను అట్టేపెట్టాడు కటి. ఆలా అనేక విషయాలపైకి మళ్ళింది సంభాషణ.

ఆ పండగ రెండురోజులూ తన సరసకు వచ్చేవారికోసం పూసలు, యితరత్రా కొనిపెట్టడానికోసం డబ్బు కూడబెడుతున్నాడుకూడా. కటి భార్య ఇటీవలే పోయింది. ఆ పండుగ రోజులలో అపాటి లైంగిక స్వేచ్ఛను ఆ గూడేల్లోనివారు అనుభవిస్తుంటారు. మహరాజ్‌కు యిస్రూ ఏం కానుకలు తీసుకుపోవాలనుకుంటు కుంటున్నాడో తెలుసుకోగోరాడు కటి.

'ఏమో చూద్దాం' అని ఆలోచనలో పడిపోయాడు యిస్రూ.

ఏటా మహరాజ్‌కు మేకలైతే సమర్పిస్తున్నారు కానీ మహరాజ్ తమ బాగోగుల గురించి ఒక్కనాడూ వచ్చి చూసిందిలేదు.

బొంగు కొట్టే కూలి, తునికిఆకు తెంపే కూలి పెంచడానికి సర్కారీతో లడాయి చేస్తున్నానంటాడు ప్రతిసారి. కాని అయిదేళ్ళ నుంచీ అదే కూలీ యిస్తున్నారు. మహరాజ్ నేను మీవాణ్ని మనమంతా ఒకేజాతి గోండుజాతి అంటుంటాడు ప్రతిసారి. మహరాజ్ దర్శనం, మహరాజ్ మాటలు ఎందుకో మొక్కుబడిగా మారినట్లనిపించింది యిస్రూకు.

మోతీ మాత్రం తప్పకుండా వెళ్ళాల్సి వుంటుంది. వెళ్ళకపోతే తమ గూడెం పటేల్ కుర్దుగాయితల్ ద్వారా పదిరూపాయలు దండుగ మహరాజ్‌కు పంపించాల్సి వుంటుంది.

మగవాళ్ళు వెళ్ళకపోతే ఏమీలేదు కానీ ఆడవాళ్ళు మహరాజ్ కొలువుకు తప్పక వెళ్ళాలి. వెళ్ళి నాట్యం చేయాలి. లేకపోతే దండుగకింద పదిరూపాయలు యివ్వాలి.

మోతీ వెళ్తే ఏసూ వెళ్తానంటాడు. వాడికి అక్కడ లకింబాయి కన్పిస్తుంది కదా! కాని చెల్లెకు తోడుండాలికదా అని, సోకుచూపుతాడేమో! కానీ ఈ చేను కాపలా తన ఒక్కడితో అయ్యేపనా? చేతికొచ్చిన పంట! ఆగం కాదూ! ఎవరినీ పోనిచ్చేదిలేదు.

అదీగాక తనవద్ద ఎవీ డబ్బులు! ప్రస్తుతం మూడు రూపాయలుమాత్రమే వున్నాయి. పంట యింటికొచ్చి జొంగు కొట్టడం ప్రారంభించేదాక తనకు ఏవిధంగానూ డబ్బు అందే అవకాశం లేదు! ఏం చేయనూ! ఏమోలే! ఎప్పటి సంగతి అప్పటికి! ఏమనుకుంటాడో!

కొన్ని చేపలు పెట్టి తాబేలు తీసుకుని నడుస్తున్నాడు యిస్రూ. నడుస్తూనే పాకమీదికి మనసుపోయింది.

మోతి జొన్నఅంబలి కాచే వుంటుంది. పోగానే చేపలు కాల్చుకుని అంబలి తాగుతూ లంచుకు సన్నెగడ్డలు, చేపలు కరకర నములుతుంటే!

ఓహ్! ఎన్నిరోజులైంది నీసు తినక! చేనులోకి పరుగెత్తుకొచ్చిన చెవులపిల్లిని తిని వారంబాటింది. ఈమధ్య ఏదీ దొరకకపోయె! అబ్బ! నీసు తినక వారం గడిచిందీ!

జొన్నగడుక వేసుకుని నూనెవేసి వండిన చేపలు తింటె అదే తమకు గొప్ప భోజనం. నూనెకు పైసలు కావాలి. నూనె వాడాలంటే యింకెన్ని రోజులు గడవాలో! ఈ అంగీ చివిగిపోయింది. మరో అంగీ కుట్టించుకోవాలన్నా ఎంత కాలం ఆగాలో!

× × × ×

అలా తమ బతుకూ జీవన స్థితిగతులూ ఆలోచిస్తూ జొన్నచేను చేరాడు యిస్రూ. తన వూహలన్నీ తలకిందుకు కావడంతో ప్రైప్రాణం పైనే పోయింది. పాక వాతావరణమంతా మారిపోయింది.

పాకలో ఫారెస్టు అధికారులు తిష్టవేసికూర్చున్నారు. ఏసును పారిపోకుండా గుంజకు కట్టేశారు బాగానే కొట్టినట్టున్నారు, శరీరంపై కొట్టినచోట్ల దద్దుతేలింది.

అంబలి కాసినకుండ తన్నుతో వక్కలైనట్టుంది. ఒలికిపోయిన అంబలి తాగడానికి గండుచీమలు బారులుతీరాయి. పైకి వున్న గడుకముల్లె కర్రతో కొట్టడంతో మంచంలోని గడ్డిలో కారిపోయింది. మోతీని కొట్టినట్టున్నారు. ఏడ్చిఏడ్చి చెంపలు కన్నీటితో ధారలు కట్టాయి.

అదంతా జీవితంలో భాగమై పోయింది. అందుకే కొద్దిక్షణాల్లోనే తేరుకున్నాడు. అరె ! మేకలేవీ ! ఆతృతగా జొన్నచేనువేపు చూశాడు. చేనుని పాడు చేయలేదు నయం. కానీ మేకలేమైనట్టు ?

వచ్చినవాళ్ళే యిస్రూ దాచుకొన్న యిప్పసారాని బాగా తాగినట్టున్నారు. పాకలో గుప్పున వాసన విసరికొడ్తోంది. గుడిసె పైకప్పుకూడా కొంతపీకి కుప్పేసినట్టున్నారు. పెద్దపులి కొట్టిన ఎద్దులావుంది వాతావరణం.

ఇస్రూని చూడ్డంతోనే మాటాపలుకూ లేకుండానే జంతువులా అరుస్తూ కర్ర పుచ్చుకొని పైన పడ్డాడొకడు. ఆ దెబ్బలు కాచుకుంటుంటే సొరకాయబుర్ర పగిలిపోయింది. చేపలు చెల్లాచెదురయ్యాయి.

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పుండుమీద దెబ్బ తాకి విలవిలలాడిపోయాడు యిస్రూ. బాధగా అడివి గుండె అవిసిపోయేట్టుగా అరిచాడు.

అప్పుడు నోరు విప్పారు అధికారులు. 'ఇంతసేపటిదాక ఎటుపోయినవురా ! నీకోసం ఎంతసేపని పడివుండాలెరా' తిట్లదండకం వల్లించారు.

రిజర్వు ఫారెస్టులో మేకలు అక్రమంగా మేస్తున్నందుకు వాట్ని జప్తు చేసినట్టు, ఆ పాకకు కట్టె కొట్టినందుకు దండుగ, ఫారెస్టు భూమిలో జొన్నవేసినందుకు ఏటాయిచ్చే మామూలు అన్నీకలిపి తనమీద మోయలేని భారం మోపినట్టు ఆ తిట్ల ద్వారా అర్థమైంది యిస్రూకు.

ప్రతిఏటా యిలా దౌర్జన్యం చేస్తున్నారని ఈ సారి వర్షాకాలం పూనక ముందే తునికిఆకు కూలీపైసలొచ్చాక అందరు జమచేసి కుర్ధుగాతీల్ చేతిమీదుగా యిచ్చారు.

అతను కుర్ధుపటేల్ వద్దకువచ్చి డబ్బుతీసుకునిపోయినపుడు తానుకూడా వున్నాడు. బిండుగడ్డం, బొడమీసం, మేకవమిలినట్టుగా ఎపుడూ దాదకాక పాన్, వుర్దూ, తెలుగూ, గోండూ కలిపి కొట్టేస్తుంటాడు.

పీడేమో ఎర్ర బుర్రమీసాలవాడు. అంటే పాతవాడు బదిలీ అయిపోయాడా! దిమ్మెక్కినతల అదుపులోకి వచ్చిన ఎంతసేపటికి గానీ ఈ ఆలోచన రాలేదు.

కుర్దు మాత్రమే యివన్నీ మాట్లాడగలడు. అన్న కుర్దుకే తెలుసు. 'ఓయా' అని ఏదో కేకవేయబోతూ మరోవేపు వెళ్ళడానికి అడుగుముందుకేసాడు.

తమమీదకు దాడికి పిలుస్తున్నాడనుకున్నారువాళ్ళు. భయంతో 'అరవకు' అని హెచ్చరించారు.

మోకాళ్ళమీద నిలబడి అందరికాళ్ళు పట్టుకున్నాడు. అసహ్యించుకొంటూ కసిరారువాళ్ళు.

'నాన్నా! వీళ్లు మనలనెందుకు కొడుతున్నారు? ఏంతప్పుచేశామని, బాధగా గోండుభాషలో అడిగాడు ఏసు.

'భాషలు మాట్లాడకురా!' అంటూ అధికారి పళ్ళుకొరికాడు. ఏసుకు ఏదో చెప్పాలనుకొన్న యిస్రూ, నోరు అలాగే మూతపడింది.

'మేకపట్టీ' పోటపట్టీ మామూలు కలిపి మొత్తం యాభైరూపాయలు జుర్మానా యివ్వాలె! రెండు రోజుల్ల యివ్వకపోతే మేకలు జప్తు మాత్రమేకాదు! జొన్నచేనుకూడా దక్కది' హెచ్చరించారు వాళ్ళు. అదేమాట మళ్ళీ హెచ్చరించారు.

యాభయి రూపాయలంటే మాటలా! యాభై! వున్నఫళంగా ఎక్కడ్నించి వస్తాయి? యాభై యిచ్చినా జప్తు చేసిన మేకలలో ఒకటో రెండో స్వాహాచేసి మిగిలినవే యిస్తారుకదా! పంబైనా దక్కాలంటే యాభయి యివ్వక తప్పదు.

'రేపటినుంచి' కలకబొంగు కొట్టండి. ఈ జుర్మానా అందులో కోసుకుంటాం. ఈ ఒక్కసారికే యీ అవకాశంరా! ఆ!'

వాళ్ళు సమస్యను సృష్టించారు పరిష్కరించారు. వాళ్ళొచ్చిన అసలు కారణం వివరించడానికి యింతప్రాతిపదిక కావాల్సివచ్చింది.

ఇస్రూ జవాబుకు ఎదిరిచూడకుండానే వెళ్ళిపోయారు.

త్వరలో వర్షాలు తగ్గుముఖం పడ్తాయి. యిక బొంగుకట్టె పని ప్రారంభమౌతుంది. కొట్టుకుపోయినమట్టి త్రోవలో బాగుచేస్తారు. మంచి రోడ్డునాను

కొనివున్న గూడేలలో యింతకన్నాహీనం. వాళ్ళ కుటుంబంలో సగంమంది విధిగా బొంగుకొట్టడానికి వెళ్ళాల్సిందే. పేపరుమిల్లు నిరాటంకంగా నడవాలంటే ఫారెస్టు అధికారులు తీసుకునే చర్యలలో యిదొకటి. వారిపొలాలు, చేన్లకాపలా గూ్ప ఎంత మొత్తుకున్నా ఫలితం శూన్యం. విధిగా బొంగు కొట్టాల్సిందే. తమ గూడేలు మరీ లోతట్టుకుండడంవల్ల తాము బతికిపోయారు. త్రోవ సాపుగావున్న అడవిలో నుండి లోతట్టుకు పోదామని మరీపట్టుపట్టి కుర్దు చచ్చిపోయిన పెద్దన్న యిక్కడ గూడెం పెంపొందించాడు.

ఇక్కడినుండి కూడా కాగితం పరిశ్రమకు బొంగు సరఫరా కావల్సిందే. అయితే దసరాకు కొంచెం అటూయిటూగా ఈ పని ప్రారంభమౌతుంది.

మహారాష్ట్ర ప్రభుత్వం తన రిజర్వు ఫారెస్టునుండి కొట్టించిన బొంగు పరిశ్రమలు అభివృద్ధి చెందాలి అనే నెపంమీద అతి తక్కువ (సబ్సిడీ) ధరకు ఆ మిల్లుకు సరఫరా చేస్తుంది. పేపరురేటుమీద మాత్రం ప్రభుత్వం పరిమితి విధించలేదు.

ఈ పేపరుమిల్లు మరిపదిహేనేళ్ళ తర్వాత నడవడానికోసం అవి ప్రభుత్వం అడవి నరకడం ప్రారంభించింది. అడవినరికి వ్యవసాయయోగ్యం చేసికొన్న భూముల్ని పై సొఖర్చులేకుండా గోండుల్నుండి ఆక్రమిస్తారు ఫారెస్టు అధికారులు. అక్కడ కలకబొంగు ప్లాంటేషన్సు ప్రారంభిస్తుంది ప్రభుత్వం.

అలా పోడువ్యవసాయం తరిగిపోయి ప్లాంటేషన్ అభివృద్ధి చెందుతోంది. అలా ఎప్పటికప్పుడు నిరాశ్రయులైన గోండులు స్థిరవ్యవసాయం చేసికోవడానికి నెట్టివేయబడ్డారు.

అలా అడవి నరికి వ్యవసాయం మొదలుపెట్టి రెండు మూడేళ్ళు దున్ని రాళ్ళేరి పంటతీస్తూ మంచిభూమిగా తయారు చేసేసరికి ఫారెస్టు అధికారులో దొరలో ఆ భూమి తమదని వస్తారు. వారిని తిరిగి యథాపూర్వస్థితికి నెట్టి వేస్తుంటారు.

దొరలంటే ఒక వర్గమేకాని ఒక కులంకాదు. అంకిస ప్రాంతంలో వెలమదొరలు, సిరొంచలోనైతే ముస్లిందొరలు, మిగతాచోట్ల పటేళ్ళు, సర్పంచులు మరికొన్నిచోట్ల షావుకార్లు.

పెల్లుబికిన కన్నీరు కనుగుడ్లలోనే యింకిపోయింది. ఇక్కడితోనే అయిపోయిందా! తమ జీవితాలలో యింకెన్ని బాధలు అనుభవించాల్సివుందో! పెద్దదేవుడికి, మహాకాంళమ్మకు ఏంమొక్కులు తక్కువ చేశామో! తమమీద యింత నిర్దయ, కోపం ప్రదర్శిస్తున్నారు. ఈసారి పంటకోత ముందు జరిపే పండుగలో బాగా మొక్కులు తీరుస్తాం! మమ్మల్ని రక్షించు తండ్రీ. అంతదాకా ఓపిక పట్టు తల్లీ!

ఏసు కట్టు విప్పాడు యిస్రూ. కూరలు వుడికించే కుండలో నీళ్ళు పోసింది మోతీ. ఆ నీళ్ళే అంబలి రంగులో వున్నాయి. ఆ నీళ్ళతో అంబలి కాయడం మొదలెట్టింది.

కట్లతో బిగుసుకుపోయిన కండల్ని రుద్దుకున్నాడు ఏసు. పాకముందు పొడవాటి బొంగుకు పైకొసన కట్టిన కత్తి - మేకలకు చిగురుకొమ్మల్ని కోసే కమ్మకత్తి అపుడే విచ్చుకున్న మబ్బులలోంచి వచ్చి వర్షిస్తోన్న వెలుగుకి నల్లగా మెరుస్తోంది.

దాన్ని చేతిలోకితీసుకుని తండ్రివేపు చూశాడు ఏసు. దాంతో ఒక్కొక్కడి తల తెగవేయడానికి అనుమతివ్వు అని తండ్రిని అడగడంలేదుకదా ఆ చూపులు!

ఇస్రూ అదేమి గమనించడంలేదు. మంచంలో ఒలికిపోయిన పొడిగడకని మంచంకింద గుడ్డపరిచి మంచంలోని గడ్డిని మెల్లగా లేవనెత్తి కిందకు వాల్చుతున్నాడు. గడకతోపాటు గడ్డిరెల్లుకూడా రాలుతోంది.

తెల్లబట్టలవాళ్ళంటే చిన్నప్పట్నుంచీ మోతీకి ఎందుకో తగనిభయం. నాన్నకూడా వాళ్ళని చూస్తేభయపడుతాడుకదా! కుర్దుగాయిళల్ (గూడెంపెద్ద) వాళ్ళకు వంగివంగి దండాలు పెడతాడు. ఎంతో మర్యాద చేస్తాడు.

ఎప్పటివలెనే ఈరోజు వుదయం అంబలికాసి యింతతాగి మేకల్ని తీసుకుని కచ్చాబాటవెంట కమ్మకత్తి తీసుకువెళ్ళింది. ఏదైనా కాయోపండో తనకూ దొరకొచ్చని ఆశపడింది. ఆ బాటవెంట ఎవరో తెల్లబట్టలవాళ్ళు రావడంతో భయంతో పాకకు పరిగెత్తుకొచ్చింది.

అన్నఅంబలి అలా గిన్నెలోపోసుకున్నాడోలేదో వాళ్ళుగిన్నెనీ అంబలి కుండనీ ఒక్కతన్నుతన్నారు. నోటికాడి బుక్క ఎత్తగొట్టినందుకు అన్న ఎదురు

తిరిగాడు. వాళ్ళ నలుగురు అన్న ఒక్కడు. అన్నని చితకదన్ని గుంజకు కట్టేశారు. పాకంతా వెదికారు. చిందరవందర చేశారు. మంచంకింద గడ్డిమప్ప కిందదాచిన సారా వెతికి పట్టుకున్నారు. పంటల పండుగకోసం అని తండ్రి దాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నాడు. అంతసారా! మొత్తం గుటకాయస్వాహా చేశారు.

ఎర్రబడ్డ కళ్ళతో తనని చూస్తుంటే ఎంతభయం వేసిందీ! ఎక్కడైనా పారిపోవాలనిపించింది. కాని అన్నను ఎక్కడికైనా తీసుకుపోతే తెలిసేది ఎలా? ఏం చేయాలో తోచక బిక్కుబిక్కుమంటూ అలాగే వుండిపోయింది.

యిద్దరూ అవేవీ గమనించడంలేదు. జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడం ఎలా! అని ఆలోచిస్తున్నాడు. ఏం జరిగింది? ఎలాజరిగిందని అడగలేదు ఏదో లాగు ఒకలాగు ప్రారంభమై యిలా జరగడం తమ జీవితంలో భాగమైపోయింది. అడగనందుకు ఏసు చెప్పనూలేదు.

తాబేలు తప్పించుకు పారిపోయింది. చేపల్ని వెదుకుతోంది మోతి.

'రాత్రి కుర్దు గాయికల్ ని గూడెంకు రమ్మను' గడక రాలుస్తూనే ఏసుకు పని పురమాయించాడు.

గుర్రుగా తండ్రివేపు చూసి కసిగా అడుగులువేసికొంటూ కుర్దు చేనువేపు వెళ్ళిపోయాడు ఏసు.

× × × ×

ఆనవాయితీ ప్రకారం ఆ రాత్రి కుటుంబపెద్దలంతా ఆ గూడెంలో సమావేశమయ్యారు. సమస్య వచ్చినపుడల్లా సమావేశం కావడం వారి ఆనవాయితీ.

అందరిదీ అదేసమస్య. రేపటినుండి కంకబొంగు కొట్టడానికి అందరూ వెళ్ళాలని వుత్తర్వు. కనీసం ఇంటికొకరైనా ఈ పంటకోతల దాకావెళ్ళాలి. కోత కొచ్చిన పంటల్ని విడిచి ఎలా వెళ్ళడం అన్నదే సమస్య. ఆ సమస్య కొత్తదికాదు. ఏటా ఎదుర్కొనేదే. అయినా ఏటా కొత్త సమస్యలాగే.

వెలుతురు కోసం నెగడు రాజేశారు. పుల్లలు ఎగదోస్తుంటే మంటతో లేస్తున్న మిణుగుళ్ళు చెల్లాచెదురుగ వెలిగి ఆరిపోతున్నాయి.

మూడునెలలుగా ఆ గూడెంలో ఎవరూ లేకపోవడంతో నిర్మానుష్యంగా పాడుబడి పోయాయి. ఆ గూడెంలో యిరవై వర కుంటాయి గుడిసెలు. ఇరవై మందిదాకా జమఅయ్యారు.

నెగడుచుట్టూ కూర్చున్నారు. ఏటా యిదేపాటేనా! దీనికి విరుగుడులేదా! అందరి మనస్సులలోనూ అదేభావం. కాని ఏం చేయాలో ఎవరికీ తోచడంలేదు.

'ఈ పుల్లర వచ్చినోనికల్ల కొత్తగ కట్టుడుడెట్ల ?' భీము తన అసమ్మతి తెలిపాడు.

'నిజమేగని! నాకుమాత్రం కట్టాలనివుందా ; మరేంజేద్దాం' కుర్దుపటేల్ అడిగాడు.

తను గూడెంపెద్ద. ఈ గూడెం మర్యాద కాపాడాల్సిన బాధ్యత తనది. దొరలకు, ఈ అధికారులకు ఏది చేరాలన్నా తన చేతులమీదుగా వెళ్ళాల్సిందే. వచ్చి పోయే ఈ అధికారులకు విశ్రాంతిగృహం వేయించాల్సిన బాధ్యతకూడా తనదే. విశ్రాంతిగృహంలో ఏడాదిలో ఏకొద్ది రోజులో వచ్చివున్నా తమ పాకలకంటే విశాలంగా అందంగా వుండాలి. లేకపోతే వారికి కోపం వస్తుంది. ఆ కోపం తమ జీవితాల్ని భస్మంచేస్తుంది. వారికి కోపం రాకుండా చూడాల్సిన బాధ్యత తనది.

ఏం జేద్దాం అంటే ఎవరూ మాట్లాడలేకపోయారు. ఎగవెడ్తే ఎంత బాగుంటుందని అందరి తలల్లోనూ వుంది. కాని ఎవరూ అంతమాట అనడానికి సాహసించలేకపోయారు.

'నేను బొంగుకొట్టటానికి పోతె ఇగ ఏను కావలిగాసినట్లే, పంట చేతికొచ్చి నట్టే యిగ' యిస్రూ ఏసు నిద్దరమొహాన్నిగూర్చి చెప్పాడు.

'ఏనునే తోలియ్యి! వాళ్ళను నేను సముదాయిస్తా' కుర్దుపటేల్ రాజీ కుదిర్చాడు.

అలా నామమాత్రపుకూలీకి అందరు తలవంచారు. అది కూలిపని అనడం సరికాదు. వెట్టిచాకిరీ.

తీసుకుపోయిన వారిమేకలు విడిపించుకురావడానికి కుర్దు బాధ్యత తీసుకున్నాడు.

'వీళ్ళపీడ యిగ మనకు వదలదా ?' ఎవరో అడగనే అడిగారు.

'దసరా వత్తున్నదిగద, ఈసారి అహిరి మహరాజ్‌కి యివన్ని చెప్పు కోవాలె'. రాజయ్య అన్నాడు ఆశగా.

'అవు ! యాల్లకు యాదిజేసినవు. ఈసారి దసరకు అహరి మహరాజ్ కాడికి రాని ఆడిబాయిలు పదిరూపాల పట్టిగూడ యియ్యాల్లో రేపో యియ్యాలె ! మీరే తీసుకచ్చి యియ్యాలి మరి ! లేకపోతే మన గూడెం మర్యాద పోతది ?' అంటూ అందరినీ ఎవరెవరు వస్తున్నదీ రానిదీ వాకబు చేశాడు కుర్దు.

'నీ సంగతేంది యిస్రూ ! మోతీని పంపిస్తవా ? పంపిస్తె కావలి కష్టం అయితది ! నిజమే ? మరి ఏంజేస్తవు ?' అడిగాడు కుర్దు.

పదిరూపాయలు వున్నఫళంగా ఎక్కడ్నించి తేగలడు తాను ?

'దాన్ని నేనే తీసుకువస్త ! చుక్కబొట్లు పొడిపించాలె !' అన్నాడు యిస్రూ :

'మరి కావలి ఎట్ల ?' కుర్దు సందేహించాడు.

'అందరం ఆ రెండ్రోజులు బొంగుకొట్టుడు బందు పెట్టాలె' ఈ మాట అందరికి నచ్చింది.

రాజుకున్న నెగడు నివురు గప్పింది. ఆ రాత్రి ఎవరి చేనులలోకి వారు వెళ్ళిపోయారు.

× × × ×

ఆరోజు పంట కోతల పండుగ. పంట చేతికి వచ్చేముందు పండుగ చేసి కోవడం ఆనవాయితీ. ఏ గూడానికి ఆ గూడెం మొత్తంగా ఈ పండగ జరుపు కుంటారు.

రాత్రయింది. రెండుమూడుసార్లు వెలుతురుకోసం నెగడు మండుతోంది. వంటలు చేసేవాళ్ళు వంట చేస్తున్నారు. సాంప్రదాయక నృత్యం చేసేవాళ్ళు నృత్యం చేస్తున్నారు. యిప్పసారా తాగేవాళ్ళు తాగుతూనేవున్నారు.

అంతా స్వేచ్ఛగా ఎక్కడికక్కడ జరిగిపోతున్నట్టుగా వుంది. కాని గూడెం పూజారి ఈ వుత్సవంలో ప్రధాన పాత్రధారిగా అది యిలా, ఇది యిలా అని పురమాయిస్తున్నాడు.

ఆ గూడెంలో పండుగ జరుపుకుంటారని ఏసు ద్వారా లకింబాయికి ముందే తెలుసు. ఆ సాయంత్రానికే ఆ గూడెం చేరింది. జాకెట్టు తీసేసింది. ఏసుతో ఆటపాటలలో పాల్గొంటోంది ఉత్సాహంగా.

పెళ్ళయితే ఛాతీమీద వేరే ఏ అచ్ఛాదన లేకుండా కొంగు కప్పుకొని వుండడం ఆ గోండుల ఆనవాయితీ. తాను వలచిన ప్రియుని యింటికివచ్చి చేరి పోవడం 'ఇల్లచొచ్చుడు'గా వ్యవహరింపబడుతుంది. ఇక మళ్ళీ పెళ్ళితంతు ప్రత్యేకంగా వుండదు. అలా ఆ సాయంత్రమే జాకెట్టు తీసేసి ఏసుతో కల్సిపోయి తన అభిప్రాయాన్ని చేతలద్వారా చెప్పింది లకింబాయి.

ఆ మాటకొస్తే లకింబాయి కొద్దిరోజుల క్రితమే జాకెట్టు తీసేసింది. ఇస్రూ, మోతీ దసరాకు అహిరి మహరాజ్ దర్శనానికి వెళ్ళినపుడే లకింబాయి ఏసు మంచె చేరి జాకెట్టు తీసేసింది. అది ఎవరికీ తెలేదు. అందుకే మళ్ళీ ఇక్కడ కొత్తగా జాకెట్టు విడిచేసింది.

అడవిలో ఏకాంతం, పచ్చని జొన్నచేను. మెచ్చిన పెనిమిటి. ఎంత మధురం ! తన తండ్రి బాబూరావుమడె కూడా దసరాకు అహిరి వెళ్ళడంతో సరిపోయింది. తల్లికి తెలిసీ తెలియనట్టు వూర్కొంది. తండ్రికి తెలిస్తే ఎంత రగడ అయ్యేదో !

ఇస్రూకు దసరా అనుభవం మాత్రం ఈసారి చేదుగా అనిపించింది. మహరాజ్‌కు మంచిమేక కానుకకింద పోయింది. ఎప్పటివలెనే ఫారెస్టు అధికారుల పీడ వదిలిస్తానని, కూలీలు పెంచడానికి లడాయి చేస్తానని, ఢిల్లీకి పోయి కొట్లాడేందుకు ఈసారి వచ్చే ఓట్లప్పుడు కూడా తనకే ఓటేసి గెలిపించాలని మొక్కుబడి ఉపన్యాసం విన్నాడు. అదేమీ యిస్రూని సంతృప్తి పరచలేదు. మహరాజ్ ఏటా లడాయి చేస్తున్నా అనే అంటున్నాడు. తమ బతుకులు మాత్రం అలాగే వున్నాయి. ఈ కాస్త దానికి మేక పోగొట్టుకున్నందుకు విచారంగా వున్నాడు.

ఈరోజు మరో మేక తెగింది. అది చాలుతుందో లేదో ! బాబూరావు మడె వస్తే ఎంత అల్లరి అవుతుందో ! తన్యాకులాటకి భయపడి కొడుక్కు తానే ఈ వుపాయం నేర్పినట్టు తిట్టిపోస్తాడేమో ! ఎంత లడాయి అవుతుందో ! [illegible] రాజీకి వస్తే మరెంత సారా మరెన్ని మేకలు కావాలో !

యిప్పసారా తాగుతూనేవున్నా యిస్రూని ఆవరించిన విచారం పోలేదు. అవన్నీ మరిచిపోవడానికి మరింత జోరుగా తాగుతున్నాడు.

జొన్నపంటమీద తీర్చుతాన్ని తెచ్చిన సూనెలో వేయించి మోతీ మాంసం ముక్కల్ని యిస్రూవద్ద పెట్టింది. ఆ పండుగరోజు వంటలు కలిపి చేసినా, విడివిడిగా చేసినా అందరూ కలుపుకుని కలిసి తినడం ఆనవాయితీ.

తలఎత్తి కూతురువేపు ఆప్యాయంగా చూశాడు యిస్రూ. ఇపుడు మోతీ ముఖం ఎంత అందంగా వుంది! ఎన్ని పచ్చబొట్లు పొడిపించాడూ మొన్న! ఇక దీన్ని పెళ్ళి చేసికోవడానికి ఎవడూ వంకపెట్టలేడు. అది చుక్కబొట్లు పొడిపిస్తుంటే ఏడుస్తుందేంటి! దీనికేం తెల్సు చిన్నపిల్ల! వూర్నుంచి కొన్ని పూసలు కొనిచ్చాడు తాను. నెగడు వెలుతుర్లో అవి ఎంత బాగా మెరుస్తున్నాయీ!

ఆప్యాయంగా పక్కన కూర్చోబెట్టుకొని యిప్పసారా బలవంతాన త్రాగించాడు యిస్రూ.

ఎక్కడో చిన్న కలకలం విన్పించింది. అందరూ అటుచూశారు. బాబూరావుమదె, వాళ్ళ గూడెం పటేల్ అన్మంతుగాయితల్ మరోయిద్దరు పెద్దమనుషులు ఆ గూడెంమీదికి లడాయికి ఒస్తున్నట్టుగా వచ్చారు.

అప్పటికే ఆలస్యమైందని గ్రహించారు. జాకెట్టు తీసేసిన లకింబాయి ఏసుతో కలిసి ఎగురుతోంది. వాపసు తీసుకొని పోదామనుకున్నవాళ్ళకి కోపం రెచ్చిపోయింది. బాగా రగడచేశారు.

గూడెం పూజారి, కుర్దుపటేలు యిరువర్గాలకు సంధి కుదిర్చారు.

'ఒక్క పూసలేదు! ఒక్క చీరెలేదు! సవేమిరా వీల్లేదు' అన్నాడు బాబూరావు.

పంటకోత లయ్యాక పూసలూ, చీరలూ లకింబాయికి ఏసు కొనిపెట్టడానికి పూజారీ, కుర్దు హామీ యిచ్చారు. మళ్ళీ మరునటిలోజే ఈ పెళ్ళి దావతు యివ్వడానికి నిర్ణయమైంది.

యిస్రూ లటొదిటో మొత్తుకున్నాడు. 'ఈరోజు పండుగలోనే అందరం సర్దుకుందాం. మీ గూడెం వాళ్ళని ఈ రాత్రే రమ్మనండి' అన్నాడు. అతడిమాట

ఎవరికీ పట్టలేదు. వారికి పండగలంటే మహాప్రాణం కదా! వచ్చిన అవకాశం జారవిడుచుకొంటారా!

కొత్త సంసారానికి కొత్త పాట వేయడానికి సంతోషంగా అంగీకరించాడు కాని ఆ మరుసటిరోజు పండగకు సంతోషంగా అంగీకరించలేకపోయాడు.

మరుసటిరోజు పండుగ ఖర్చంతా యిస్రూమీదే పడ్తుంది. మరో రెండు మేకలూ, ఐదుకుంచాల అనుములూ బదలుతెచ్చి ఖర్చుచేయాలి. షావుకారువద్ద నూనె వుప్పు బాకీ మరింత పెరిగిపోతుంది.

ఆ పండగ ఏసుకి ఎంత సంతోషదాయకంగా వుందో యిస్రూకి అంతకంటే విచారంగా వుంది.

× × × ×

పట్టపగలే గూడెం నిద్రబోతున్నట్టుగా వుంది. ఎక్కడివాళ్ళక్కడ పనికి వెళ్ళిపోయారు.

జొన్నపంట యింటికి చేరి ఆ గుడిసెలో ఒకేఒక్క పిద్ర తీసింది. షావుకారుకు బాకీకింద చెల్లుపోయాలి. రేపోమాపో పోద్దాంలే! ఎటుపోతాయి! ముందు ఏసుకు గుడిసె వేయాలి! అనుకుని అదేప్రయత్నంలో వున్నాడు యిస్రూ.

నాలుగయిదు మంచి టేకుదూలాల్ని నరికి గుంజలు పాతారు. మొగురం టేకుదే. వాసాలుగా కంకబొంగు పరిచారు. గుడిసెచుట్టూ గోడలా కంకబొంగులే పాతారు.

మిట్టమధ్యాహ్నం. మబ్బు విడిచిన ఎండ తీక్షణంగా కొడుతోంది. పని చేసి అలసి అలా కూలబడిపోయాడు యిస్రూ. లకింబాయి తెచ్చిన మంచినీళ్ళు తాగాడు.

మోతీ, లకింబాయి, ఆపని, ఈపనిలో సహకరిస్తూ అలసి అలా ఆరుబయలు గుడిసెముందు ఒదిగి కూర్చున్నారు.

ఏసు బొంగుకొట్టడానికి వెళ్ళిపోయాడు. గుడిసెపక్కన జొన్నసొప్ప కుప్ప వుండడంతో త్రోవకు అడ్డంగా వుండి ఏమీ కన్పించడంలేదు.

ఫారెస్టు అధికారుల బృందం అకస్మాత్తుగ కళ్ళబడే సరికి వణికిపోయాడు యిస్రూ. ఏం చేయాలో పాలుపోలేదు. లకింబాయి, మోతీ కూడా అలాగే శిలా ప్రతిమ లైపోయారు.

దొంగతనంగా కలప కొట్టారని యథావిధిగా నానా రభస చేశారు. కాళ్ళు కడుపులు పట్టుకున్నాడు యిస్రూ.

ఎండకు యవ్వనంతో మెరుస్తున్న లకింబాయిపై వారి కన్నుపడింది. పాక లోని యిప్పసారా దొరకబుచ్చుకొని మత్తుగా తాగి లకింబాయి పట్ల చాలా అవమాన కరంగా ప్రవర్తించారు.

కోపం, దుఃఖం, నిస్సహాయత ముప్పిరిగొన్నాయి. తమని రక్షించండని కాళ్ళావేళ్ళా పడ్డాడు యిస్రూ.

యాభయిరూపాయల జుర్మానా విధించి, కొద్దిరోజులు గడువిచ్చి వెళ్ళి పోయారు. ఆ గడువులోగా చెల్లించకపోతే కంకబొంగు కొట్టే కూలీలో వంద కోసు కుంటామని హెచ్చరించారు.

ఏంచేయాలో తోచక తలపట్టుకు కూర్చున్నాడు. లకింబాయి అవమాన భారంలో కుంచించుకుపోయింది. మోతీ భయంతో బిక్కచచ్చిపోయింది.

కోపంతో పిడికిలి బిగించిన గాలి స్తంభించింది. చెట్లు కడుపులో దాచు కున్న కోపంతో గుండె ఎగపోస్తున్నా ఎంతో ప్రయత్నం మీద గంభీరంగా వుండి పోయాయి.

గుంజకు కట్టేసిన మేకలు నోరువిప్పాయి. నోరులేని జంతువుల ఆక్రం దన అడివంతా ప్రతిధ్వనిస్తోంది.

అది తమకు స్వాగతంగా ప్రవేశించారు రాజారావుదొర. నలుగురు సిబ్బంది (పోలీసుల్ని)ని వెంటతెచ్చుకున్నాడు.

"నువ్వు దున్నిన చేను నా పట్టాభూమి". తన వాటాకోసం నిలదీశాడు.

అయోమయంలో పడిపోయాడు. అది రిజర్వు ఫారెస్టు భూమి అని ఫారెస్టు అధికారులు పట్టిపట్టుకపోయారు. మళ్ళీ యిదేమిటి గొడవ ?

మోతీని పంపి కుర్దుకు కబురుచేశాడు. కుర్దూతోపాటు షావుకారూ కన్పించి గుండె బేజారై పోయింది.

సాయంత్రానికి అందరు జమ అయ్యారు. అందులో సగంమంది దున్ను తున్న భూమి తన భూమి అని దబాయించాడు దొర. ఏంచేయాలో వారికి పాలుపో లేదు. పంట చేతికొచ్చింది. ఇప్పుడేం చేయాలి ఇపుడు కాదంటే తన పొలంలో పంట కోసుకుపోయారని కేసుపెట్టి ఏళ్ళతరబడి కోర్టులచుట్టూ తిప్పుతారు. నోటిదాకా వచ్చిన బుక్క చేజారిపోయినట్లైంది. కుర్దు ఎంతో బాధపడిపోయాడు.

తలాబస్తా చొప్పున పదిబస్తాల జొన్నలు ప్రస్తుతం యివ్వడానికి కుర్దు మధ్యవర్తిగా అంగీకరింపజేశాడు. అవి షావుకారునే తీసుకురమ్మని పురమాయించి వెళ్ళాడు దొర.

దొర బస్తా, దసరా పండుక్కోసం తీసుకున్న ముతకధోతుల జత కింద బస్తాజొన్నలు కొలుచుకున్నాడు షావుకారు. విందు సందర్భంగా యిచ్చిన నూనె, వుప్పు చిల్లరకోసం మరోబస్తా కొలిచాడు.

ఇంకా రెండుబస్తాల జొన్నలు మాత్రమే మిగిలాయి. ఇందులోంచే విత్తనాలకి కొన్ని వుంచుకోవాలి. మిగిలినవి మళ్ళీ పంట చేతికి అందేదాకా తినడానికి ఏమూలకూ సరిపోవు. రోజుకోపూట అంబలి కాసుకుంటే మాత్రమే బొటాబొటీగా సరిపోతాయి.

ఏదులు, ఎలుగుబంట్లు, ఇతర జంతువులు, వుడుతలు, పిట్టలు ఎన్నింటి బారినుంచి ఈ పంటని కంటికి రెప్పలా కాపాడారు తాము. నిద్రలేదు, సుఖం లేదు. ఎన్నికష్టాలుపడి ఈ పంట యింటికి తెచ్చుకున్నారు. తన కళ్ళముందే తనదికాకుండా పోతోంది. యింకా యాభయిరూపాయలు ఫారెస్టు అధికారులకు యివ్వాల్సివుంది. తనకు తృప్తి అనిపించిన మేరకు జొన్నలు కొల్చుకొని యాభయి రూపాయలిచ్చాడు షావుకారు.

మోతీ ఏడుస్తోంది. తనకేమీ వెట్టికివ్వడం లేదని కసిరాడు షావుకారు. ఏసు కోపాన్ని ఆపుకోలేక కడ్తున్న కొత్త గుడిసెని చిందరవందర చేశాడు. షావుకారు యివేవీ చూడనట్టే తనపని తాను చేసుకుని వెళ్ళిపోయాడు. అడివి జంతువుల బారి నుండి అహోరాత్రాలు కాపాడిన జొన్నపంట ఆ మర్నాడు బండ్లమీద షావుకారు యింటికి; వచ్చిన యాభై రూపాయిలు కుర్దుద్వారా అధికారుల జేబుల్లోకి వెళ్ళిపోయాయి. ఏడ్వడానికైనా కళ్ళల్లో తడి మిగలలేదు యిస్రూకి.

× × × ×

అడవిలో కాస్తున్న ఎండకూడా చల్లగా వెన్నెల్లాగే వుంది. ఎండ తగల కూడా ఆకాశమంత ఎత్తు ఎదిగిన వృక్షాలు వారికి గొడుగుపడుతున్నాయి. గాలికి అడివి అడివంతా కదులుతోంది. అపుడపుడు ఆకు లొక్కొక్కటి రాలుతున్నాయి. అక్కడక్కడ వనంలోని పురుగుల రొద, పుడతల పరుగులు కిచకిచలు లయగా లయగా విన్పిస్తున్నాయి. ఆ....వీస్తున్న గాలిలో వాతావరణం అడవిలా గంభీరంగా వుంది.

'నీ విక్కడే వుండు కామ్రేడ్' అని సెంట్రి కామ్రేడ్‌కు చెప్పి దళ కమాండరు మిగతా అయిదుగురిని తీసుకుని నీటికాల్వ వేపు నడిచారు. అక్కడికి ఆ చెరువు దగ్గరే. వంచుకున్న గిన్నెలు కడిగేశారు. కడుపునిండా నీళ్ళు తాగి ఒక గిన్నెలో సెంట్రీ కామ్రేడ్‌కు నీళ్ళు తెచ్చారు.

అందరికి కాళ్ళు పీక్కుపోతున్నాయి. మూడురోజుల్నుంచీ నడుస్తూనే వున్నారు. తలా 25 కిలోల బరువు మూటల్తో వడివడిగా నడిచి నడిచి వచ్చారు. అందులో ఒక చిన్నన్న యిటీవలే ఆ దళంలో చేరాడు. మానసికంగా సడలని దృఢ దీక్షతోనే వున్నాడు కానీ శరీరం సహకరించడంలేదు. నడక యింకా అలవాటు కానట్టుంది. ఆకలికి మాడిమాడి తిన్నారో ఏమో! కళ్ళు మూతలుబడిపోతున్నాయి.

కమాండర్ గొంతు సవరించుకొని ప్రారంభించాడు.

'కామ్రేడ్ ! మనం ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్ని దాటేసి ప్రస్తుతం మహారాష్ట్ర అడవులలో వున్నాం. అహిరి, సిరొంచ, ఏటపల్లి తాలూకాలు ఇలా అటు యిటూ వుంటాయి.' అంటూ భౌగోళిక స్వరూపాన్నీ రాజకీయ స్వరూపాన్నీ వివరించాడు.

'కామ్రేడ్ !' అంటూ నిద్రపోతున్న చిన్నన్నని పిలిచాడు. వులిక్కిపడి చూశాడు చిన్నన్న.

'ఈ తాలూకాలలో వరి, జొన్న, మిర్చి, పొగాకు, అనుములు, పెసరు ప్రధాన పంటలు. సిరొంచ ప్రాంతంలో ఆదివాసీలు, తర్వాత నేతకానివారు, ఆరె, వారు ఎక్కువగా వున్నారు. ఈ రెండుకులాలు హరిజనకులాల పట్టికలో చేర్చబడ్డాయి. గౌడ తదితరులుకూడా కొద్దిగా వరుచుకునివున్నారు.

చాలా గ్రామాలలోకి యింకా కరెంటు ప్రవేశించలేదు. ఇక్కడ అడవి

జంతువులుకూడా ఎక్కువే! మనకు శత్రువుతోపాటు యివికూడా ఒకోసారి ప్రమాదాన్ని కలుగజేయవచ్చు. ఈ అడవి జంతువుల్ని ఇక్కడి ప్రజలు చంపడానికి వెరుస్తారు. ఫారెస్టు అధికారులు పెట్టే కేసులకు భయపడి. మనుషులకు మాత్రమే రక్షణలేదు. పశువుల్ని ఆ జంతువులు చంపితే పదోపరకో నష్టపరిహారం పేరిట వారి మొహానకొట్టిపోతారు."

ఆగి చిన్నన్నవేపు చూశాడు కమాండరు, వింటున్నావా అన్నట్టుగా. చిన్నన్న సర్దుకుని కూర్చున్నాడు. నిద్రమబ్బు వదిలిపోయింది. కమాండరు మళ్ళీ అందుకున్నాడు.

"అంకిస, ఆసరెల్లి, పెంటిపాక, అమ్రాజంలాంటి కొన్ని గ్రామాలలో చెరువులు, కుంటలున్నాయి. అక్కడ వరి ఒక్కపంట మాత్రం పండుతుంది. ఇపుడిపుడే బోరింగ్ బావుల వ్యవసాయం ప్రారంభమైంది. వూరికి ఒకటి రెండు మించి యింకా బోరింగ్ బావుల వ్యవసాయం రాలేదు. మిగతాచోట్ల తిండికోసం జొన్నలు పండిస్తారు.

ఇక్కడి గోండులలో రకరకాల శాఖాతెగలున్నాయి. చిన్నచిన్న తేడాల్తో అందరి జీవన సంస్కృతి ఒకటే. గోండులు ఎక్కువగా జొన్నగడుక తింటారు. లేదా జొన్నంబలి తాగుతారు.

అసరెల్లి, బొర్రాయిగూడెం చుట్టుపక్కల గోండులతోపాటు కోయ, మాల, మాదిగ, గౌడ కులాలవారు ఎన్నదగిన సంఖ్యలో వున్నారు.

ఈ ప్రాంతానికంతా కలిపి సిరొంచలో ఒకేవొక కాలేజి వుంది. అంకిసలో పదవతరగతిదాకా, అసరోలి, మద్దికుంట, అరడ, జనంపల్లి, జనగమారుల్లో ఏడవ తరగతిదాకా స్కూళ్ళున్నాయి. మిగతా గ్రామాలలో కొన్ని ఏకోపాధ్యాయ పాఠశాలలు రికార్డులలో మాత్రమే వున్నాయి.

అంకిస, సిరొంచలలో విద్యార్థులకు హాస్టళ్ళున్నాయి. ఆహిరిలో ధర్మరాజు మహారాజ్ వుచిత హాస్టల్ వుంది. జనగనూరులో ఆశ్రమ పాఠశాల వుంది." మట్టిపై పుల్లతో పటంగీచి ఏరులూ, నదులూ, పల్లెలూ, రోడ్లూ సవిస్తరంగా వివరించాడు కమాండరు.

"ఇక్కడి ప్రజలు పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, లక్ష్మిదేవర మొదలయిన

దేవుళ్ళకు మొక్కుతారు. దసరాకు అహిరి మహారాజ్ కొలువు తర్వాత ఈ ప్రాంతంలో పెద్ద జాతర మహంకాళి జాతర. అది ఏటా ఏప్రిల్ 5న జరుగుతుంది. అంకిసకు పక్కనేవున్న చింతరేవుల గ్రామంలో ఈ జాతర జరుగుతుంది. వనులు కూడా ఎక్కువగా వుండవు కాబట్టి దాదాపు అందరూ ఈ జాతరలో పాల్గొంటారు.

మనం తొలుత అహిరి, సిరొంచ, ఏటపల్లి, ఆలపల్లి, భమాగడ్, కిష్టాపురం, జనగనూరు, రమేష్‌గూడెం, కమ్మనూరు మొదలైన ఈ చుట్టుపక్కల గ్రామాల్తో సంబంధాలు నెలకొల్పుకోవాలి.

ఇక్కడి స్కూళ్ళల్లో మరాఠీ మీడియంలో బోధించినా, హిందీ, తెలుగు సబ్జక్టు లుంటాయి. ప్రజల్లో చాలామందికి, హిందీ, తెలుగు, మరాఠి, గొండి, కోయల భాషలు మాతృభాషతోపాటు వస్తాయి. అయితే అక్షరాస్యులు గ్రామానికి ఒక్కరిద్దరికి మించిలేరు.

ఇక్కడి గోండులు బుడ్డగోచి మోకాలిపైకి బిగించికడ్తారు. తునికి ఆకుతో చుట్టలు చేసికొని పొగాకు నింపుకుని తాగుతారు. నెత్తికి రుమాలు చుట్టుతారు కొందరు.

ధోతి హాఫ్‌లుంగీ లాగే కడ్తేవాళ్ళు గొండివాళ్ళుగా మనం గుర్తుపట్టవచ్చు. ఆడవాళ్ళు సాధారణంగా మెడలో కుత్తికట్టుపూసలు వేసికొంటారు." అంటూ కట్టూ బొట్టూ ఎలావుంటుందో పూసగుచ్చినట్టుగా వివరించాడు.

"ఇక్కడి గోండు ప్రజలకు పనికి కొరతలేదు. వర్షాకాలంలో పంటలు దీస్తారు. తర్వాత బొంగు కొడ్తారు. ఫిబ్రవరిలో విప్పపూలు ఏరుకోవడం వుంటుంది. ఆ తర్వాత తునికి చెట్టుకొమ్మల్ని నరకడం, కొత్తచిగుళ్ళు వచ్చాక తెంపడం యిలా పని చేతినిండుగా వుంటున్నప్పటికీ కూలిరేట్లు తక్కువకావడం, దొరల అధికారుల షావుకారుల దోపిడీకి అంతం లేకపోవడంవల్ల వీళ్ళ బతుకులు అదిలాబాద్ గోండులకన్నా మెరుగ్గా ఏమీలేవు.

ఇక్కడి గిరిజనులు స్వంతంగా విప్పసారా కాచుకొంటారు. పోలీసులు ఇది సాకుగా దౌర్జన్యం చేస్తుంటారు. ఇక్కడ ప్రభుత్వ సంస్కరణలు, సంక్షేమ పథకాలు కలికానికైనాలేవు, ఆశ్రమపాఠశాలలు హాస్టలు మినహాయిస్తే. కంట్రోలు సరుకులు వగైరా దొరలు, షావుకార్లు, సర్పంచులు పైపైనే కాజేస్తారు. గ్రామాల

దాకా వీదీచేరదు. అవుగొడ్డు పుల్లర సనుగుకు యాభైపైసలు, మేకలకు సనుగుకు రెండురూపాయలు పట్టీ వసూలుచేస్తారు. ఎంత చిన్నమందవున్నా దఫేదారుకు ఏటా ఒకటీ అరా మేకలు లంచంగా యివ్వాల్సివుంటుంది. మధ్యమధ్య దాడులు చేస్తూ జరిమానాలు వసూలు చేస్తుంటారు. ఇక్కడి గిరిజనులు పేదరైతుకూలీలు మరీ అమాయకులు. తెల్లబట్టలవాళ్ళంటే భయపడ్తారు.

మూఢనమ్మకాలు జాస్తి. మనం చాలా జాగ్రత్తగా వారితో కలిసిపోవాలి వుంటుంది" అలా స్థూలంగా అక్కడి జనజీవనం పరిచయంచేశాడు కమాండరు. అందరు ఎంతో ఆసక్తిగా విన్నారు. ఇంకా అలా వివరాలు చెపుతూనే వున్నాడు కమాండరు.

మూటాముల్లె సర్దుకుని కూర్చున్నచోట ఆనవాలు లేకుండా చేశారు. బయలుదేరారు.

ఆకాశం వురిమిన చప్పుడైంది. సెంట్రీ అపైకిచూశాడు. మబ్బులేమీ లేవు. అడవిలో వేసిన రోడ్డంట బొంగులారీ రొదచేసికొంటూ వెళ్ళిపోతున్నట్టుంది అల్లంతదూరంనించి.

కమాండర్ హెచ్చరించాడు మరోసారి. 'క్రామ్రేడ్స్! మనం శత్రువు చొరబారలేని దుర్గమారణ్యాలలో వున్నాంకదాని ఏమరుపాటున వుండకండి. మన ఆచూకీ శత్రువుకెట్టి పరిస్థితిలలోనూ తెలియనివ్వగూడదు.'

అలా అడవిలో నడిచి పొద్దుగుంకేవేళ ఆ గ్రామంచేరారు.

శీతలపవనాలు వీచడం ప్రారంభమైంది. అక్కడక్కడ నెగడు రాజేసు కున్నారు. కంచం చేతబట్టుకొని మరోచేత తింటూ ఏవో ముచ్చట్లు చెబుతున్నారు గూడెంతో.

కమాండురు కుర్దుగాయిశల్‌ను జాడదీసుకుని కలిసారు. చాలాసేపు సంభాషణ జరిగింది.

కొద్దిసేపట్లోనే కుర్దు అందర్నీ పిలిచాడు. కుర్దు ఇంటిముందున్న నెగడు చుట్టు కూర్చున్నారందరు. కుర్దు వారిని గూడేనికి పరిచయంచేశాడు.

'మనకు బొంగుకొట్టేకూలి పెంచడానికి, తునికి ఆకుకూలి పెంచడానికి మన కష్టాలు పోగొట్టడానికి పెద్దదేవరే వీళ్ళను మనదగ్గరికి పంపిండు. ఇగ [illegible] మనతోనే వుంటరు వీళ్ళు, మనతోనే తింటరు.'

కొందరు అనుమానంగా చూశారు. 'అహీర్ మహరాజ్‌ను కలిసివచ్చిన్రా మీరు ?' ఎవరో అడిగారు.

కుర్దు సముదాయించాడు. 'మెన్న దసరకు మహరాజ్ ఏమన్నడు ? నేను ఎట్లైన కూలీలు పెంచెటట్టు చేస్త. నాకు వీలుగాకపోతె ఎవరినైన తోలిస్త అన లేదా ! మహరాజ్ వీళ్ళని తోలించిండవచ్చు. మనకోసం ఎంతో దూరంనుంచి కష్టపడి వచ్చినోల్లను అనుమానించుడు మంచిదిగాదు. ఇదువరదాక అందరు మనను బెదిరించుక తినోల్లే ! కని ఈల్లు మనలను అడుక్కుతింటన్రు. గదిగదీ ! గమనించున్రి. వాల్లకు తిండి దొరుకకనా ? సూడబోతె అందరు సదువుకునోల్లె తీరున్నరు. వీల్లు మనకోసమే వచ్చిన్రు.'

ఏసు కూర్చున్నకాడినుంచి లేచి అన్నల పక్కన వచ్చిచేరాడు. ఎగాదిగా చూశాడు. చేతిలోని తుపాకీ చూశాడు. ఆశ్చర్యంగా అలాగే చూస్తున్నాడు. కమాండరు పలకరింపుగా చిరునవ్వు నవ్వాడు.

ఆనవ్వుతో ఏసు బెరికితనం కొంతతగ్గింది. 'ఇదేంటిది ?' ఆసక్తిగా అడిగాడు. తాను అవి దొరలవద్దా పోలీసులవద్దా మాత్రమే యిదివరకు చూసివున్నాడు. వీళ్ళవద్దకూడా వుండడంచూసి నమ్మలేకపోయాడు.

'తుపాకీ' అన్నాడు కమాండరు చూడుమన్నట్టుగా చూపాడు. లకింబాయి, మోతీ ఆసక్తిగా ఏసు పక్కన చేరారు. ఒక్కరొక్కరు అందరు వాటిని స్పర్శించి యిటూ, అటూ తిప్పిచూసి ఆనందపడిపోయారు.

యిస్రూ చలికి పుండు మరింత సగలకుండా ఏవేవో ఆకులు పేర్చి పాత గుడ్డ చుట్టాడు కాలికి. ఆకులు యింతలావుగా ఎబ్బెట్టుగా కన్పిస్తోంది. జారిపోయిన ముడివిప్పి తిరిగి బిగించి కడ్తూ అడిగాడు యిస్రూ.

'దాంతోటి అడివిపందులు, ఏదులు చంపచ్చునా !'

'చంపచ్చు ! మనను చంపవచ్చే మనుషులనుకూడా దీంతోటి చంపచ్చు' చిన్నన్న హుషారుగా చెప్పాడు.

'ఆఁ'

అందరు తనివితీరా వాటిని తాకారు. ప్రేమగా నిమిరారు.

## భావరూపం

—జాబిల్లి

[తునికాకు పోరాటం విజయవంతమైన తరువాత అడవుల గురించి ఒక గోండు రైతుతో మాట్లాడిన పిదప - ]

ఆడికున్నవి గయి రెక్కలే
నాకున్నవి గయి రెక్కలే
ఆడేనా, పోలీసోడేనా కొట్టేది
నేనూ దుడ్డు అందుకుంటే చితగ్గొడతా
గిట్లే మాట్లాడుతా
గ.... పోలీసోడు ఏం జేసిండు
గ ... సర్కారోడు ఏం జేసిండు
గ.... అన్నలే జేసింద్రు
గిట్లే మాట్లాడుతా

---

కొంత సేపటికి కుర్దు మాటపై తలాకొంత వండిన గడుకతెచ్చి వారికి వేసేరు. కారం గడుకతో ఆ రాత్రి వారిభోజనం.

తిని మళ్ళీ మాటలలో పడ్డారు. ఎంతోరాత్రి దాకా ఏదో వొకటి మాట్లాడుతూనే వున్నారు.

అడవిగాచిన వెన్నెల ఆకాశాన్ని కప్పేసిన వృక్షాల్ని చీల్చుకొని అడివంతా పరుచుకొంటోంది. ఆ వెన్నెల్లో గూడెంలోని గుడిసెలన్నీ తడుస్తున్నాయి.

దారి దొరికినట్లనిపించిన ఏసు వింత వింత వూహలతో ఆ రాత్రంతా నిద్ర పోలేదు.

× × × ×

(ఈ కథలో చిత్రించిన సంస్కృతి, విశేషాలు తెలిపిన ఆదివాసులకు, సాధన, అనురాధలకు కృతజ్ఞతలు)

(పోలీసులచే మహారాష్ట్రలో ఎదురుకాల్పులపేర 2-11-80 న హత్యచేయబడ్డ కామ్రేడ్ పెద్దిశంకర్‌ను సంస్మరించుకొంటూ.)